ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



కడప
జిల్లా వార్తలు

3

గురువారం 27 జూన్ 2024

సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల

● ఇంటర్ మొదటి సంవత్సరంలో 37 శాతం

● పదో తరగతిలో 81 శాతం ఉత్తీర్ణత

కడప (ఎడ్యుకేషన్), జూన్ 26: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో 37 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బుధవారం తాడేపల్లి ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. జిల్లాలో 5740 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరకాగా 2117మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2117 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. అలాగే.. పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు సైతం విడుదలయ్యాయి. జిల్లాలో 81శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బుధవారం విజయవాడ ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయంలో పరీక్షల సంచాలకులు దేవానందరెడ్డి ఫలితాలు విడుదల చేశారు. 2566 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 2083 మంది (81శాతం) ఉత్తీర్ణత సాధించారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా నీలం పూజిత



కడప(క్రైం), జూన్26: జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా నీలం పూజితను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈమె ప్రొద్దుటూరు డీఎస్పీగా విధులు నిర్వహించారు. అదనపు ఎస్పీగా కూడా పనిచేసి కర్నూలుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆమెను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న మాసుంబాషాను విజయవాడ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవలసిందిగా ఆదేశించారు.

శ్రీనివాసరెడ్డి హత్య కేసులో సీఐడీ విచారణ షురూ

● టెక్నికల్ అంశాలపై దర్యాప్తు

(కడప-ఆంధ్రజ్యోతి): ల్యాండ్ సెటిల్‌మెంట్లు, భూకబ్జాల్లో సంపాదించిన సొమ్ము పంపకాలు, ఇతరత్రా కారణాలతో వైసీపీ నేత శ్రీనివాసరెడ్డిని సొంత బ్యాచే గత ఏడాది జూన్ 23న అంతమొందించింది. ఈ కేసులో న్యాయం జరగలేదని మృతుడు శ్రీనివాసరెడ్డి సతీమణి మౌనికతో పాటు మరికొంత మంది బాధితులు డీజీపీని ఆశ్రయించారు. దీంతో ఆయన ఈ కేసును సీఐడీకి అప్పగించారు. ఈ మేరకు సీఐడీ డీఎస్పీ పద్మలత కడపకు వచ్చి హత్య కేసుకు సంబంధించి విచారణ మొదలుపెట్టారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఇప్పుడు హత్య కేసులో నిందితులుగా ఉన్న వారి ఫోను కాల్ డేటాను పరిశీలిస్తున్నారు. హత్యకు ముందు ఎవరెవరితో మాట్లాడారు, ఎవరెవరు ఎక్కడున్నారు, కాల్ రికార్డ్స్, సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ ఎక్కడి నుంచి ఆపరేట్ చేశారు అనే విషయాలను పరిశీస్తున్నారు. అలాగే.. హతుడు శ్రీనివాసరెడ్డి, ప్రధాన నిందితుడుగా ఉన్న ప్రతాప్‌రెడ్డితో పాటు ఇతర అనుమానితులకు సంబంధించిన టెక్నికల్ ఆధారాలను సేకరించే పనిలో పడినట్లు చెబుతున్నారు. హత్యకు ముందు జరిగిన లావాదేవీలు, హతుడు మిగతా నిందితులు, అనుమానితుల బ్యాంకు ఖాతాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అప్పట్లోనే హతుడితో పాటు ఇతర అనుమానితుల కాల్‌రికార్డులు, ఇతర డేటా ఆధారంగా దర్యాప్తు చేశారు. అయితే కేసులో పెద్ద తలకాయలను పక్కకు తప్పించినట్లు చెబుతారు. కేసు దర్యాప్తులో కీలంగా ఉన్న పోలీసులు అప్పట్లో వైసీపీ నేతల సూచనల మేరకు కొందరి పేర్లు తప్పించినట్లు సమాచారం. ఓ ఎస్పీ స్థాయి అధికారి ఓ డీఎస్పీ, సీఐలు వైసీపీ నేతలతో చెట్టపట్టాలు వేసుకుని తిరిగారని విమర్శలున్నాయి. దీంతో కేసును పక్కదోవ పట్టించారని అంటారు. హతుడు శ్రీనివాసరెడ్డి సతీమణి మౌనిక పెండ్లిమర్రి మండలానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి , ప్రసాద్, గుంటినాగేంద్ర, విశ్వనాథరెడ్డి , రామ్మోహన్‌రెడ్డి, జమీల్‌పై అనుమానం ఉన్నట్లు అప్పట్లోనే ఫిర్యాదు చేశారు. మరికొందరి పెద్దల హస్తం కూడా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పుడు కేసు సీఐడీ చేతిలోకి పోవడంతో అసలు దోషులెవరో తేలనుంది.

● నిబంధనలకు విరుద్ధంగా వందల కోట్ల రుణాలు

● పులివెందుల ప్రాంతానికి అత్యధికం


● ప్రొద్దుటూరు ఏరియాలోనూ భారీగా రుణాలు ● వసూళ్లు ప్రశ్నార్థకం

● సీఐడీ విచారణ చేస్తే వాస్తవాలు తేటతెల్లం

● 2014కు ముందు కూడా సీఐడీ విచారణ

డీసీసీబీని కొల్లగొట్టేశారు..!?

ఏదైనా అవసరం వచ్చి బ్యాంకు ద్వారా రుణం పొందాలంటే పలు ఆంక్షలు, నిబంధనలతో రుణ గ్రహీతలను ఉక్కిరిబిక్కిరి చేస్తారు. ఇదంతా సామాన్యులకే. ఈ నిబంధనలు కొందరికి మాత్రం వర్తించవు. ఆ కొందరిలో అత్యధికంగా రాజకీయ పలుకుబడి ఉన్నవారే ముందు వరుసలో ఉంటారు. ఇక రాజకీయ నాయకుల పెత్తనం ఉండే సహకార బ్యాంకులైతే చెప్పనక్కరలేదు. కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) గత మూడు, నాలుగేళ్ల సమయంలో వందల కోట్ల రూపాయలు రుణాలు మంజూరు చేసింది. అయితే.. నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీ నేతల ఆదేశాలే అర్హతగా బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేశారనే చర్చ సాగుతోంది.



కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 26: రైతాంగం ఆర్థికంగా బలోపేతం కావడం కోసం భూములు తనఖా పెట్టుకుని మార్టిగేజ్ రుణం మంజూరు చేస్తుంటారు. మార్కెట్ విలువ మేరకు 70 నుంచి 85 శాతం వరకు రుణం పొందే అవకాశం ఉంటుంది. ఈ రుణాన్ని సకాలంలో వడ్డీతో సహా కంతుల వారీగా చెల్లించాల్సి ఉంటుంది. రుణం పొందిన రైతు తిరిగి సకాలంలో చెల్లించకపోతే తనఖా పెట్టిన భూమిని వేలం వేసి జమ చేసుకునే వెసులుబాటు బ్యాంకుకు ఉంటుంది. కానీ ఇటీవల డీసీసీ బ్యాంకు మంజూరు చేసిన రుణాలకు సంబంధించిన భూ యాజమాన్య పత్రాలపై కూడా అనుమానాలున్నాయంటూ బ్యాంకు అధికారులు గుసగుసలాడుకుంటున్నారు. దీంతో తప్పుడు పత్రాలకు రుణాలు మంజూరు చేశారనే చర్చ సాగుతోంది.

పులివెందుల ప్రాంతానికే అత్యధికం

మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల ప్రాంతానికి డీసీసీ బ్యాంకు గతంలో అత్యధికంగా రుణాలు మంజూరు చేసినట్లు సమాచారం. దాదాపు రూ.400 కోట్ల రుణాలు అందించారని అంటున్నారు. రాజకీయంగా పలుకుబడి కలిగిన వ్యక్తుల ఇంటికి రెండు మూడు రుణాలు మంజూరు చేసినట్లు సమాచారం. ఒక ప్రజాప్రతినిధి వ్యక్తిగత సహాయకుడికి 3, 4 రుణాలు ఇచ్చినట్లు చర్చ సాగుతోంది. ఈ రుణాల్లో దాదాపు కోటి రూపాయలకు పైగా ఆయన ప్రయోజనం పొందారని అంటున్నారు.

ప్రొద్దుటూరులోనూ..

ప్రొద్దుటూరులోని వైఎస్సార్ కాలనీ బ్రాంచ్‌తో పాటు మరో బ్రాంచ్‌లో కూడా భారీ స్థాయిలో రుణాలు మంజూరైనట్లు సమాచారం. గతంలో గృహ నిర్మాణాల కోసం ఇచ్చిన భూములకు కూడా రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన ఆ భూముల్లో కొంత మేర గృహాలు నిర్మితమయ్యాయి. ఆ సర్వే నెంబర్ల ద్వారా కూడా నకిలీ పత్రాలు తయారు చేసుకుని రుణం పొందినట్లు చర్చ నడుస్తోంది. ప్రొద్దుటూరులోని డీసీసీ బ్యాంకు రెండు బ్రాంచుల్లో దాదాపు రూ.150 కోట్లకు పైగా రుణాలు మంజూరైనట్లు సమాచారం. గతంలో ప్రొద్దుటూరులోని ఒక బ్రాంచ్‌లో మేనేజరుగా పనిచేస్తూ ప్రస్తుతం ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వ్యక్తి హయాంలో ఎక్కువ సంఖ్యలో నకిలీ పత్రాలకు రుణాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఈయన హయాంలోనే నకిలీ బంగారానికి రూ.6లక్షల మేర రుణం మంజూరు కాగా, ఈ అంశాన్ని మరో మేనేజరు గుర్తించినట్లు సమాచారం. దీంతో డీసీసీబీలో చక్రం తిప్పుతున్న ఓ సలహాదారుడు గుట్టుచప్పుడు కాకుండా ఆ మొత్తాన్ని జమ చేయించి ఆ అధికారిని కాపాడారని ప్రచారం సాగుతోంది. రైతులకు ఆర్థిక సాయం అందించే ముసుగులో కొంత మంది రుణాల పేరుతో భారీ స్థాయిలో కోట్లాది రూపాయలు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిజమైన రైతులకంటే బినామీలకే అత్యధికంగా రుణాలు మంజూరైనట్లు బ్యాంకు వర్గాల సమాచారం.

రికవరీ ప్రశ్నార్థకమే

ఇబ్బడిముబ్బడిగా రుణాలు మంజూరు చేయడం సంతోషకరమే. అవి నిబంధనలకు అనుగుణంగా పంపిణీ చేసినట్లయితే రైతాంగం బాగు పడుతుంది. కానీ అక్రమ మార్గంలో వైసీపీ ప్రభుత్వ అనుయాయులకు ఈ రుణాలు అందినట్లు సమాచారం. నకిలీ పత్రాలకు రుణం మంజూరు చేశారని అంటున్నారు. ఇదే జరిగి ఉంటే రుణ వసూళ్లు ప్రశ్నార్థకమే అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, రాయచోటి ప్రాంతాల్లోని రైతులకు డీసీసీ బ్యాంకుల ద్వారా అధిక సంఖ్యలో రుణాలు మంజూరు చేశారు. వందల కోట్లలో ఇచ్చిన రుణాలను తిరిగి వసూలు చేయడం బ్యాంకు అధికారులకు తలకు మించిన భారంగా కనిపిస్తోంది. ఇదే పరిస్థితి ఉమ్మడి కడప జిల్లాలో 2014 ముందు కూడా చోటు చేసుకుంది. నకిలీ పత్రాలకు కోట్ల రూపాయల రుణాలు అందించి స్వాహా పర్వానికి గత పాలకవర్గాలు తెరలేపాయి. దీంతో అప్పట్లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో రాజంపేట, రైల్వేకోడూరు, బద్వేలు ప్రాంతాల్లోని పలు సొసైటీలపై సీబీ సీఐడీ అప్పట్లో విచారణ చేపట్టింది. పలువురిపై శాఖపరమైన చర్యలు తీసుకున్నారు. ఇదే తరహాలో ప్రస్తుతం పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, రాయచోటి నియోజకవర్గాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో పాటు వాటికి సంబంధించిన డీసీసీ బ్యాంకు బ్రాంచ్‌ల్లో సీఐడీ ద్వారా సమగ్రంగా విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశాలు లేకపోలేదు.

అక్రమాలకు సహకరించారని అందలం

జిల్లాలో రాజకీయ నేతల అక్రమాలకు సహకారం అందించారనే ఉద్దేశ్యంతో బ్యాంకు పరిధిలోని ఓ అధికారికి పదోన్నతి కల్పించినట్లు తెలుస్తోంది. గతంలో ఎక్కువ మొత్తంలో రుణం మంజూరు కావాలంటే బ్రాంచ్ మేనేజరు రుణపత్రాలను డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయానికి పంపించాల్సి ఉండేది. అధిక మొత్తంలో రుణం మంజూరు కావాలంటే డీసీసీ బ్యాంకులోని ఏజీఎం, డీజీఎం, జీఎం స్థాయిల్లో పత్రాలు, భూములకు సంబంధించి విచారణ చేయాల్సి ఉంటుంది. కానీ ఇవేవీ లేకుండానే కోట్లాది రూపాయలు రుణ రూపంలో బ్యాంకు నుంచి కొల్లగొట్టారనే చర్చ సాగుతోంది. డీసీసీ బ్యాంకు ద్వారా ఇచ్చే నిర్దేశిత మొత్తాన్ని వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మరింత పెంచి ప్రధాన కార్యాలయ అధికారుల పాత్ర లేకుండానే రుణాలు మంజూరు చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై డీసీసీ బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో రాజామణిని ఆంధ్రజ్యోతి వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు.



హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత

● ఇడ్లీ, సాంబార్ తిని 8మందికి వాంతులు ● ప్రైవేటు ఆసుపత్రికి ఇద్దరు విద్యార్థుల తరలింపు

● విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీసిన మంత్రి ● విచారణ చేపట్టిన ఆర్డీవో, డీడీ, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్

ముద్దనూరు, జూన్ 26: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు బుధవారం ఉదయం ఇడ్లీ, సాంబార్ తిని వాంతులు చేసుకున్నారు. దీంతో అస్వస్థతకు లోనవడంతో ఇద్దరు విద్యార్థులను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం సాంఘిక సంక్షేమశాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామికి తెలియడంతో ఆయన అధికారులను పురమాయించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక బాలుర ఎస్సీ వసతిగృహంలో దాదాపు 60 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ప్రస్తుతం 24 మంది హాస్టల్‌లో ఉన్నారు. వీరు బుధవారం ఉదయం వంటమనిషి చేసిన ఇడ్లీ, సాంబార్ తిన్నారు. దీంతో యశ్వంత్, బన్నీ, ప్రేమ్‌కుమార్, లక్ష్మీనరసింహ, వెంకటేశ్, సుశాంత్, బాలు, మహీధర్ వాంతులు చేసుకున్నారు. వారిలో యశ్వంత్, బన్నీ పరిస్థితి విషమంగా ఉండటంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వార్డన్ మనోహర్ అందుబాటులో లేరు. ఈ విషయం ప్రసారమాధ్యమాల ద్వారా తెలుసుకున్న మంత్రి బాలవీరాంజనేయస్వామి కలెక్టర్ విజయరామరాజుకు సమాచారం అందించారు. వెంటనే ఆర్డీవో శ్రీనివాసులు, డీటీ సౌజన్య, ఎంపీడీవో చంద్రమౌళి, డాక్టర్ కరీష్మ, సీఐ దస్తగిరి, గ్రామ పంచాయతీ అధికారులు హాస్టల్ వద్దకు చేరుకున్నారు. జరిగిన వ్యవహారంపై ఆర్డీవో హాస్టల్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇడ్లీ, సాంబారుకు వాడిన కూరగాయలను పరిశీలించారు. చెడిపోయిన కూరగాయలు వాడినట్టు గుర్తించారు. ఆసుపత్రికి వెళ్లి చికిత్సపొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్‌తో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితి బాగుందని డాక్టర్ తెలియజేశారు. తరువాత జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి, ఏఎస్‌డబ్ల్యువో స్వర్ణలత, డీఎంహెచ్‌వో నాగరాజు, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ హరిత ఆసుపత్రికి వెళ్లి చికిత్సపొందుతున్న విద్యార్థులను పరిశీలించారు. హాస్టల్ వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. విద్యార్థులతో పూర్తి వివరాలు సేకరించి వార్డన్ మనోహర్, వంటమనిషి ప్రసాద్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పలకరిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

గత ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనం

● విద్యార్థి సంఘాలు

గత ప్రభుత్వం ప్రభుత్వ వసతి గృహాలను నిర్వీర్యం చేసిందని టీఎన్ఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు విమర్శించాయి. హాస్టల్ విద్యార్థుల నిత్యావసరాలకు సంబంధించి బిల్లు రాకపోవడంతో వార్డన్ నాణ్యతలేని ఆహారం అందిస్తున్నారన్నారు. వార్డన్, వంట మనిషిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీడీ సరస్వతికి వినతి పత్రం అందించారు. ఏపీ ఎమ్మార్పీయస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ అస్వస్థతకు గురైన విద్యార్థులను పరిశీలించి, తరువాత హాస్టల్‌లోని వసతులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని డీడీని కోరారు.

కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

● డీఆర్వో గంగాధర్ గౌడ్



కుష్టు నియంత్రణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఆర్వో గంగాధర్ గౌడ్ తదితరులు

కడప(కలెక్టరేట్), జూన్ 26: జిల్లాను కుష్టు రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో లెప్రసీ కేసెస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్పీడీసీ)పై డీఆర్వో అధ్యక్షతన జరిగిన జిల్లా సమన్వయ వ్యాధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జాతీయ కుష్టు వ్యాధి గుర్తింపు అవగాహన కార్యక్రమాన్ని వచ్చే నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా ఆశా వర్కర్లు, వలంటీర్లు, సచివాలయ ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి గృహాల్లో ప్రతి ఒక్కరినీ పరీక్షిస్తారన్నారు. ఎవరికైనా శరీరంపై రంగు మారిన మచ్చలు, చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బుడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పలు రాలిపోవడం, కనురెప్పలు మూతబడక పోవడం, ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం లక్షణాలు ఉంటే అవి కుష్టు వ్యాధికి సంకేతాలన్నారు. చేతులు, కాళ్లల్లో బొబ్బలు రావడం, వేళ్లు వంకర్లు తిరగడం వంటి లక్షణాలు ఉంటే కుష్టు అనుమానిత లక్షణంగా చెప్పవచ్చన్నారు. ఇలాంటి లక్షణాలున్న వ్యక్తులకు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన చికిత్సకు రెఫర్ చేస్తారన్నారు ఎవరికైనా వ్యాధి లక్షణాలు నిర్ధారణ అయితే మందులు 6 నెలల లేదా ఏడాది పాటు ఉచితంగా ఇస్తారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో ప్రతి విద్యార్థికీ ఎల్పీడీసీ పరీక్షలు నిర్వహించాలని సోషల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు డీఆర్వో లెప్రసీ క్యాంపెయినింగ్ పోస్టర్‌ను డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటింగ్ కమిటీతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, కుష్టు, ఎయిడ్స్ టీబీ నివారణాధికారి డాక్టర్ రవిబాబు, జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ, జిల్లా అధికారులు శ్రీలక్ష్మి, సుధాకర్ రెడ్డి, సరస్వతి, సురేశ్, హెల్త్ ఆఫీసరు డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో సత్య ఏజెన్సీస్ షోరూం ప్రారంభం

బద్వేలుటౌన్, జూన్ 26 : బద్వేలు పట్టణంలోని సిద్దవటం రోడ్డులో సత్య ఏజెన్సీస్‌వారి 23వ షోరూం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. బిల్డింగ్ యజమాని డాక్టర్ బి.జయసుబ్బారెడ్డి రిబ్బన్ కట్‌చేసి షోరూంను ప్రారంభించారు. ఆయనతో పాటు సత్య ఏజెన్సీస్ ఆంధ్రప్రదేశ్ హెడ్ సెంథిల్, ప్రముఖ బ్రాండ్ కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు. సత్య ఏజెన్సీస్‌లో బద్వేలుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు సరసమైన ధరలతో ఎలక్ట్రిక్ హోమ్ నీడ్స్, ఫ్రిడ్జులు, టీవీలు అన్ని వస్తువులు లభిస్తాయన్నారు. లాభాపేక్ష లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండేలా షోరూంను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. నాణ్యతకు, నమ్మకానికి సత్య ఏజెన్సీస్ మారుపేరని వారన్నారు.



సత్య ఏజెన్సీస్ షోరూంను ప్రారంభిస్తున్న సత్యఏజెన్సీస్ ఏపీ హెడ్ సెంథిల్, జయసుబ్బారెడ్డి

గంజాయిపై ఉక్కుపాదం

● జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు ● వంద రోజుల కార్యాచరణతో గంజాయి కట్టడికి శ్రీకారం

● ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్‌కు 14500 సమాచారం ఇవ్వాలి ● ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ వెల్లడి

కడప (క్రైం), జూన్ 26: జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలపై కొరడా ఝుళిపించేందుకు వంద రోజుల కార్యాచరణ చేపట్టామని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీసు బృందాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. గతంలో గంజాయి కేసుల్లో ఉన్నవారిని మళ్లీ నేరాలకు పాల్పడకుండా పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. పదే పదే గంజాయి నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు ప్రయోగిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపడతామన్నారు. విస్తృతంగా నాకాబంది నిర్వహించి అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల ద్వారా కలిగే అనర్థాలపై కళాశాలలు, విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రజలు గంజాయికి సంబంధించిన సమాచారాన్ని 14500 టోల్‌ఫ్రీ నెంబరుకు తెలపాలని ఎస్పీ సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి నిర్మూలనలో ప్రజలు తమ వంతు సామాజిక బాధ్యతగా పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. గంజాయికి బానిసగా మారిన వారి సమాచారం ఇస్తే వారిని రిమ్స్ ప్రభుత్వ వైద్యశాలలోని డీ అడిక్షన్ కేంద్రానికి తరలించి సాధారణ వ్యక్తుల్లా మారుస్తామని తెలిపారు.

ఏఎస్పీ ఆధ్వర్యంలో ర్యాలీ

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం అదనపు ఎస్పీ లోసారి సుధాకర్ ఆధ్వర్యంలో కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ పర్యవేక్షణలో విద్యార్థులతో కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి సంధ్య సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కడపలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.





అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కడపలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఏఎస్పీ లోసారి సుధాకర్, డీఎస్పీ షరీఫ్, విద్యార్థులు



అసంపూర్తిగా ఉన్న మురుగుకాల్వను దాటేందుకు ఇబ్బందులు పడుతున్న కళాశాల విద్యార్థినులు



ఈ కష్టాలు తీరేదెప్పుడో..!

వేంపల్లెలో ప్రధాన రోడ్డుపైకి మురుగునీరు చేరడంతో గుంతలు పడి అవస్థలు పడుతున్న వాహనదారులు

- నిలిచిపోయిన రోడ్డు, కాల్వ నిర్మాణ పనులు
- బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- వేంపల్లె ప్రజల అవస్థలు

వేంపల్లె, జూన్ 26: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇలాఖ పులివెందుల నియోజకవర్గంలోని ప్రధాన మండల కేంద్రం వేంపల్లె. వైఎస్ జగన్ సీఎం అయ్యారు. వేంపల్లెలోని రోడ్లకు మహర్దశ వస్తుందని ప్రజలంతా భావించారు. ఐదేళ్ల పాలనలో రోడ్లన్నీ పూర్తవుతాయని ఎంతో ఆశించారు. ఆ ఆలోచన మూడేళ్లకు కార్యరూపం దాల్చింది. వేంపల్లె పట్టణంలోని హనుమాన్ జంక్షన్ నుంచి కడప రోడ్డులో నాలుగురోడ్ల కూడలి మీదుగా పులివెందుల రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వరకు రోడ్ల విస్త రణ, కాల్వల నిర్మాణం కోసం రూ.30కోట్లతో పనులు మంజూరయ్యాయి. విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారికి పరిహారం పంపిణీ చేసేందుకే సుమారు ఏడాదికి పైగా కాలం పట్టింది. ఆరు నెలల క్రితం పనులు హడావిడిగా పనులు మొదలు పెట్టారు. ఈలోగా ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో పనులన్నీ పూర్తిగా నిలిచిపోయాయి. ఎన్నికలకు ముందే రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్ వారం రోజజుల క్రితం మురుగుకాల్వల నిర్మాణ పనులను పూర్తిగా నిలిపివేశారు. ఈ పనులు ఎప్పుడు మొదలుపెడతారో, ఎప్పుడు పూర్తవుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీంతో వేంపల్లె ప్రజలకు కొత్త కష్టాలు మొదలయ్యాయి.

బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్

వేంపల్లెలో రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణానికి ఎంసీఎస్ఆర్ కంపెనీ పనులు చేపట్టింది. రూ.28కోట్ల వ్యయంతో 3.80 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం, రెండు వైపుల కాల్వల నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించింది. 1600 మీటర్ల రోడ్డు మాత్రమే ఇప్పటి వరకు వేశారు. రెండు వైపుల కలిసి ఆరు కిలోమీటర్ల మేర కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు. ఏడు కోట్ల రూపాయల మేర ఎన్నికల ముందే బిల్లుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపినప్పటికీ బిల్లులు విడుదల కాలేదు. దీంతో కాంట్రాక్టర్ చేతులెత్తేసి మొదట రోడ్డు పనులు, ఎన్నికల అనంతరం కాల్వ నిర్మాణ పనులను ఎక్కడివి అక్కడే వదిలేశారు.

ఎన్ని ఇక్కట్లో...

వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్లలో వర్షపు నీరు సక్రమంగా పోయే పరిస్థితి లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. వీరందరు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక చాలాచోట్ల కాల్వ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మురుగునీరు వెళ్లే దారి లేక ఎక్కడ పడితే అక్కడ నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఇళ్ల యజమానులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొత్తగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కడప-పులివెందుల రోడ్డులో నిలిచిపోయిన రోడ్డు పనులు

ఏఈ ఏమన్నారంటే..

రోడ్డు, కాల్వ నిర్మాణ పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం.

-వెంకటరమణ, ఆర్అండ్‌బీ ఏఈ

ఆర్జీయూకేటీ అడ్మిషన్ కన్వీనర్‌గా అమరేంద్రకుమార్



వేంపల్లె, జూన్ 26: ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నడుస్తున్న నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో 2024-25 అడ్మిషన్ ప్రక్రియ కన్వీనర్‌గా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సండ్రను నియమించారు. ఈ ఏడాది జరగబోయే అడ్మిషన్ ప్రక్రయ ఆయన ఆధ్వర్యంలో జరుగుతుంది. గతంలో నూజి వీడులో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గోపాల్‌రాజు కన్వీనర్‌గా ఉండగా.. ఆయన స్థానంలో అమరేంద్ర నియమితులయ్యారు. అడ్మిషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తామని కన్వీనర్ అమరేంద్ర తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ సీట్లకు 53,863 దరఖాస్తులు

వేంపల్లె,జూన్ 26: రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా 53863 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతనెల చివరి వారంలో 2024-25 విద్యా సంవత్సరంలో ట్రిపుల్‌ఐటీల్లో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సుకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరారు. ఒక్కో ట్రిపుల్‌ఐటీలో 1100సీట్ల చొప్పున 4400 సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని కోరగా గత ఏడాది 40వేల దరఖాస్తులు రాగా.. ఈ ఏడాది మరో 13వేలకు పైగా దరఖాస్తులు పెరగడంతో 53863 దరఖాస్తులు వచ్చాయి. 10వ తరగతిలో వచ్చిన మార్కులు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వెయిటేజీ మార్కులు కలిపి మెరిట్ జాబితాను తయారు చేసి జూలై 11న ఎంపిక జాబితా విడుదల చేయనున్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని మార్కుల ఆధారంగా జాబితాను రూపొందించి విడుదల చేస్తామని అడ్మిషన్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సండ్ర తెలిపారు.

జమ్మలమడుగులో హోటళ్లపై దాడులు

- హోటళ్లలో లోపించిన శుభ్రత
- యజమానులకు నోటీసులు



బిర్యానీలో వాడే పదార్థాలను తనిఖీ చేస్తున్న ఉమ్మడిజిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, బిర్యానీ హోటల్‌లో కాగుతున్న నూనెను పరిశీలిస్తున్న సిబ్బంది

జమ్మలమడుగు, జూన్ 26: జమ్మలమడుగులో బుధవారం ఉమ్మడి జిల్లా ఆహార భద్రతా అధికారి జె.ప్రభాకర్, వారి సిబ్బంది హోటళ్లపై దాడులు చేశారు. రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టారు. ముందుగా బిర్యానీ హోటళ్లలో తనిఖీ చేసి అక్కడ నూనె, బిర్యానికి వాడే పదార్థాలు, ప్యాకెట్లు పరిశీలించారు. ప్యాకెట్లపై డేట్ లేకపోవడం, శుభ్రత పాటించ కపోవడంతో నోటీసులు ఇచ్చారు. అలాగే బేకరీ షాపులపై సైతం దాడులు చేప ట్టారు. ఇక్కడ ఎక్కువగా కలర్లు, టేస్టీసాల్ట్ వాడుతున్నారని ఆరోపణలున్నప్పటికీ బుధవారం చేసిన తనిఖీల్లో బయటపడలేదు. ముందస్తుగానే సంబంధిత సిబ్బంది హోటల్ యజమానులకు తెలియజేయడంతో హోటళ్ల యజమానులు వెంటనే అప్రమత్తమైనట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కాగా, ఉమ్మడి జిల్లా ఆహార భద్రత అధికారి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు జమ్మలమడుగుకు తనిఖీ చేయడానికి రావడం జరిగిందన్నారు. ఇక్కడ నూనె, ఇతర ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకుని, బిర్యానీ శాంపిల్ పొట్లాలపై తేదీలు లేకపోవడంతో నోటీసులు ఇచ్చామన్నారు. ప్రజలు హోటళ్లపై నమ్మకంతో వస్తుంటారని.. ప్రతి హోటల్ యజమాని శుభ్రత పాటించాలని ఆదేశించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆహారభద్రత అధికారితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార పదార్థాలలో నాణ్యత లోపిస్తే చర్యలు



ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా

ప్రొద్దుటూరు, జూన్ 26: హోటళ్లలో ఆహారపదార్థాలు నాణ్యతగా లేకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు హోటళ్లపై మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పబ్లిక్ హెల్త్ అధికారులు నాలుగు బృందాలుగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హోటళ్లలోని ఫ్రిజ్‌లలో చికెన్, మాంసం లాంటి పదార్థాలు నిల్వ పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. హోటళ్ళలో పరిశుభ్రత పాటించాలన్నారు. డ్రైన్ పబ్లిక్ కాలువలోకి పెట్టకూడదని.. వ్యర్థాలు బయట పారవేయరాదని హెచ్చరించారు. బిర్యానీ సెంటర్లలో వాడే నూనెలు పరిశీలించారు. మసాలాలు ఇతరత్రాలపై సూచనలిచ్చారు. చనిపోయిన జంతువుల మాంసం, చికెన్‌లాంటి వి వాడినట్లు ఆరోపణలు వస్తే హోటళ్లు మూసివేస్తామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉట్టికిరణ్, నూర్‌బాషా, వంకం సుబ్బరాయుడు సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు. హెల్త్ ఇన్స్‌పెక్టర్లు ప్రసాద్, పద్మావతిలు మాత్రం ఈ తనిఖీల్లో పాల్గొనలేదు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

కడప (క్రైం), జూన్ 26: కడప నగరం ప్రకాశ్‌నగర్‌లో బుధవారం ఓ యువతి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చిన్నచౌకు పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశ్‌నగర్‌లో నివాసం ఉంటున్న కొట్టిపాటి భానుశ్రీ (21) ప్రైవేటు కాలేజీలో ఎంబీఏ చదువుతుంది. అక్క చెల్లెలు ఇద్దరూ అరుచుకోవడంతో భానుశ్రీని తల్లి మందలించింది. దీంతో ఆ యువతి తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు దగ్ధం - రూ.14లక్షలు ఆస్తి నష్టం



దగ్ధమైన కారు

మంటలను అదుపు చేస్తున్నఫైర్ సిబ్బంది

కడప (క్రైం), జూన్ 26: కడప నగరం అరవిందనగర్‌లో మంగళవారం తెల్లవారు జామున ఇంట్లో పార్కింగ్ చేసిన కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. కారుతో పాటు ఇంట్లో ఉన్న కొన్ని సామాన్లు కాలిపోయాయి. ఇంటి యజమాని హరికుమార్ ఫిర్యాదు మేరకు కడప ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. కారు ఇంజన్ నుంచి మంటలు రేగి కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని.. దాదాపు రూ.14లక్షల మేర నష్టం జరిగినట్లు కడప ఫైర్ సిబ్బంది తెలిపారు.

ఇంద్రభవనాలను తలపించేలా వైసీపీ కార్యాలయాలు

- నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు... పులివెందులలో జరిగిన పనులపై ఆరా తీస్తున్నాం
- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, జూన్ 26: నిబంధనలు పాటించకుండా వైసీపీ కార్యాలయ భవనాలను ఇంద్రభవనాలను తలపించేలా నిర్మిస్తున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులో మాట్లాడుతూ అన్ని నిబంధనలు పాటించినా టీడీపీ ప్రభుత్వం తమ కార్యాలయాలను కూలదోస్తోందని వైసీపీ గగ్గోలు పెడుతోందన్నారు. చిన్న ఇళ్లు కట్టుకోవాలన్న మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకోవాలని వైసీపీ ప్రభుత్వ హయాంలో చెబుతుండేవారన్నారు. 26 జిల్లాల్లోని కొన్ని జిల్లా కేంద్రాలలో కలెక్టరేట్‌లు నిర్మించుకునేందుకు ప్రభుత్వ స్థలాలు లేవని చెప్పిన వైసీపీ ప్రభుత్వ అధికారులు అవే జిల్లా కేంద్రాలలో వైసీపీ కార్యాలయాలను నిర్మించిందన్నారు. ఆ కార్యాలయాలకు మున్సిపల్ అధికారుల వద్ద అప్రూవల్స్ తీసుకోలేదన్నారు. ఆ ప్రభుత్వ భూములను రాంకీ ఇన్‌ఫ్రా పేరుతో తీసుకొని రాంకీ సంస్థనే ఆ కార్యాలయాలను నిర్మిస్తోందన్నారు. ఇదే క్విడ్‌ప్రోకో అన్నారు. కోట్లాది రూపాయల భూములు అప్పనంగా తీసుకొని కార్యాలయాలు నిర్మించారన్నారు. దానిని సాక్షి చానల్‌లో వక్రీకరిస్తున్నారన్నారు. అందులో అనుమతుల మేరకే నిర్మిస్తున్నామని చెప్పడం గాని, చూపించే ప్రయత్నం చేయలేదన్నారు. అలాగే ప్రతిపక్షనేత కూడా కాని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దాదాపు 300 మంది భద్రత కల్పించడం తెలుగుదేశం పార్టీ గొప్పదనమన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నిష్పక్షపాతంగా పాలన అందిస్తున్నారని అర్థం చేసుకోవాలన్నారు. పులివెందులలో పాడా ద్వారా ఏ పనులు ఎక్కడ చేశారో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా వేల కోట్ల రూపాయలతో పనులు చేసిన పాడాపై గత ఐదేళ్లుగా ఆడిట్ జరగలేదన్నారు. ఇపుడు ప్రభుత్వం మారడంతో తమకు అనుకూలమైన ఓ మహిళా ఆడిట్ అధికారిణితో హడావిడిగా ఆడిట్ చేయిస్తున్నారన్నారు. మళ్లీ జగనే ముఖ్యమంత్రిగా ఉంటారని అధికారులు అనుకొని ఇష్టానుసారంగా వ్యవహరించారన్నారు. గండి క్షేత్రంలో ప్రసాదాల పంపిణీ నుంచి విరాళాల సేకరణ వరకు అవినీతి జరిగిందని ఆరోపించారు. వీటన్నిటిపై సమగ్ర విచారణ చేయిస్తామన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య



విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఆర్జేడీ

సుండుపల్లె, జూన్ 26: ప్రభుత్వ బడుల్లో ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన విద్య లభిస్తుందని విద్యార్థినీ, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని ఆర్జేడీ రాఘవరెడ్డి, డీఈవో శివప్రకాశ్‌రెడ్డిలు తెలిపారు. మండలంలోని గుట్టకిందరాచపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన స్టూడెంట్ కిట్స్‌ను విద్యార్థినీ, విద్యార్థులకు నోటు పుస్తకాలు, టెస్ట్ బుక్స్, స్కూల్ బ్యాగ్‌తో పాటు ఇతర విద్యా సామాగ్రి అందజేసినట్లు తెలిపారు. మెరుగైన విద్యను అందించే ప్రభుత్వ బడుల్లో చదివిన ఎంతో మంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు శ్రీనివాసరాజు, మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్‌నాయక్, రవీంద్రనాయక్, ప్రధానోపాధ్యాయురాలు సుమలత తదితరులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు రూ.2.70 లక్షల ఆర్థిక సాయం



చిన్నారులకు సహాయం చేస్తున్న దాతలు

మైదుకూరు రూరల్, జూన్ 26: మైదుకూరులోని పాతూ రులో నివశిస్తున్న ఈశ్వర్ గుండెపోటుతో, అతని భార్య రమాదేవి బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఒకే నెలలో మృతి చెందారు. దీంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. పిల్లలను ఆదుకోవాలంటూ ఈనెల 16 తేదీ ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించి చాలా మంది దాతలు మేమున్నామంటూ ముందుకొచ్చి ఆర్థికసాయం చేశారు.
ఈనేపథ్యంలో మైదుకూరు బీజేపీ నియోజకవర్గఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు రూ.50 వేలు, అంగడి శ్రీను అనే వ్యక్తి రూ.2లక్షలు, కూశెట్టి రాయుడు రూ.20 వేలు చిన్నారులకు అందజేశారు. అంతేకాకుండా పొలాల్లో కూలీ పనులకు వెళ్లి జీవనం సాగి స్తున్న మహిళ కూలీలు కూడా ఒక్క రోజు కూలీ డబ్బు లను పిల్లలకు ఆర్థిక సాయంగా అందించారు. ఈ డబ్బు లను పిల్లల భవిష్యత్ కోసం వారి పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నట్లు సమాచారం.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి: డీఈవో



క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో

సుండుపల్లె, జూన్ 26: విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి ఉపాధ్యాయ బృందాన్ని ఆదేశించారు. బుధవారం సుండుపల్లె ఉన్నత పాఠశాల, నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో మండల మొదటి స్థానాన్ని సుండుపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే నూతనంగా ఏర్పాటు అయిన జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు బాగా చదివి జిల్లా స్థాయిలో మార్కులు సాధించాలన్నారు. సుండుపల్లె విద్యార్థులు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకట్రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు రవీంద్రరాజు, రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి : జడ్జి



వసతి గృహంలోని భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి బాబాపక్రుద్దీన్

కడప(రూరల్) జూన్ 26: హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో జిల్లా స్థాయి మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జడ్జి హిట్ అండ్ రన్ కేసులు, ఫస్ట్ యాక్సిడెంట్ రిపోర్టు, జిల్లా స్థాయి కమిటీ పనితీరు, పరిహార ప్రక్రియ, బాధితులకు పరిహారం జారీ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కడప డీటీసీ, డీఎస్పీ రవికుమార్, అన్నమయ్య జిల్లా రాయచోటి డీఎస్పీ శ్రీధర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె. రవీంద్ర, పలువురు ఆర్డీఓలు పాల్గొన్నారు.

పిల్లల విద్యా, ఆరోగ్య విషయాలపై జాగ్రత్త వహించాలి

ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహంలోని పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాపక్రుద్దీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహన్ని విజిట్ చేశారు. ఈ సందర్భంగా జడ్జి తరగతి గదులను, వంటశాలలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు.. ఏదైనా సమస్యలుంటే డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలన్నారు.

అగ్నిపథ్‌ను వెంటనే రద్దు చేయాలి

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి



ఆందోళన చేస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 26: దేశ భద్రతా వ్యవస్థను దెబ్బతీసే అగ్నిపథ్ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఆందోళనలో భాగంగా కడప లక్ష్య అకాడమీ ఎదుట ఆర్మీలో చేరే విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టిన ఆయన మాట్లాడుతూ 'అగ్నిపథ్' ద్వారా సైన్యంలో చేరేవారు నాలుగేళ్లు మాత్రమే పనిచేయాలని చేరిన వారిలో 25శాతం మాత్రమే కొనసాగుతారని మిగిలిన 75శాతం వారిని తొలగించడం దుర్మార్గమన్నారు. వీరిని ఎక్స్ సర్వీస్ మెన్‌గా పరిగణించరన్నారు. సర్వీసు నుంచి తొలగేటప్పుడు పదిలక్షల పారితోషికం ఇచ్చి చేతులు దులిపేసుకునేలా కేంద్ర ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడే వారికి ఇంత అవమానకరరీతిగా నియమాలను పెట్టడం ఏమిటని ఆగ్రహించారు. వెంటనే అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాహుల్‌దేవ్, నాగార్జున, మహేంద్ర, రాజేంద్ర పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొస్తా : బీటెక్ రవి



బీటెక్ రవిని సన్మానిస్తున్న రాష్ట్ర మీసేవ సంఘం అధ్యక్షుడు అంజన్‌కుమార్, సునీల్, లక్ష్మీనారాయణరెడ్డి

సింహాద్రిపురం, జూన్ 26: మీసేవ కేంద్రాల సమస్యలను గ్రామ, వార్డు సచివాలయ మంత్రి బాల వీరాంజనేయస్వామి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. రాష్ట్ర మీసేవా సంఘం అధ్యక్షుడు అంజన్ కుమార్, జిల్లా మీసేవా అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ కుమార్, సింహాద్రిపురం మీసేవ నిర్వాహకుడు లక్ష్మీనారాయణరెడ్డి బుధవారం సింహాద్రిపురంలో బీటెక్ రవి ఇంట్లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. బీటెక్ రవిని సన్మానించారు. అనంతరం గత ప్రభుత్వంలో మీసేవా సమస్యలను బీటెక్ రవికి వివరించారు. మంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని బీటెక్ రవి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మీసేవా నిర్వాహకులు పాల్గొన్నారు.

మార్కెట్ పేరు మార్చిన కూటమి నేతలు

కౌన్సిల్‌లో అధికారికంగా మార్చాలి



మార్కెట్‌కు పేరు మార్చి బోర్డు ఏర్పాటు చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన, కార్యకర్తలు, హిందూ ఐక్యవేదిక

పులివెందుల టౌన్, జూన్ 26: పురాతన రంగనాథస్వామి ఆలయం ఎదురుగా నిర్మించిన కూరగాయల మార్కెట్ పేరును టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు మార్చారు. వైఎస్సార్ కూరగాయల మార్కెట్‌గా ఉన్న పేరును మారుస్తూ బుధవారం రంగనాథస్వామి కూరగాయల మార్కెట్ అని బోర్డు ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశి భూషణ్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పులివెందుల కూరగాయల మార్కెట్‌కు వైసీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ కూరగాయల మార్కెట్‌గా పేరు పెట్టారన్నారు. దీనిపై టీడీపీ, బీజేపీ నేతలు అప్పట్లో వ్యతిరేకత వ్యక్తం చేశారన్నారు. గతంలో రంగనాథస్వామి పేరుతో ఉన్న కూరగాయల మార్కెట్‌కు పేరు మార్చడం ఏమిటని ర్యాలీలు, ఆందోళనలు చేసినా వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ప్రజాభిప్రాయసేకరణ జరగకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని పేరు మార్చారన్నారు. రంగనాథస్వామిని అగౌరవపరిచేలా వ్యవహరించారు. తమ నేత వద్ద మెప్పు కోసం వైఎస్సార్ పేరు పెట్టారని తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై అధికారులకు తెలియజేసినా వారు పట్టించుకోలేదన్నారు. రంగనాథస్వామి పేరుతో ఉన్న కూరగాయల మార్కెట్‌ను మార్చవద్దని విన్నవించామన్నారు. అధికారం ఉందనే అహంకారంతో పేరు మార్చారన్నారు. అందుకు ప్రతిఫలం అనుభవిస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పేరు మార్చాలని చెప్పినా నేటికీ పట్టించుకోలేదన్నారు. దీంతో తామే బోర్డు ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కౌన్సిల్‌లో ప్రవేశపెట్టి రంగనాథస్వామి కూరగాయల మార్కెట్ పేరును ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. లేదు అలాగే కొనసాగమని అంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన, కార్యకర్తలు, హిందూ ఐక్యవేదిక పాల్గొన్నారు.

జ్యోతిరావుసర్కిల్ పూర్తి చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలక్రిష్ణయాదవ్



కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 26: కడప నగరం పాతబస్టాండులో ఉన్న జ్యోతిరావుఫూలే పెండింగు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలక్రిష్ణయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరంలో పలు ప్రాంతాలను బీజేపీ బృందం పరిశీలించారు. కార్పొరేషన్ అధికారులు కూడా ఇందులో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జ్యోతిరావుఫూలే సర్కిల్ నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి వెంటనే పూర్తి చేయాలని కోరారు. సర్కిల్ నిర్మాణంతో వాహనాలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పాతబస్టాండు ప్రాంగణలో ప్రజల కోసం ఏర్పాటు చేసిన మూత్రశాలల అధిక వసూళ్లు చేయకుండా చర్యలు తీసుకోవాలని బస్టాండులో అనుమతి లేకుండా ఆక్రమణలకు గురైన ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. బస్టాండు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈ సునీల్, బీజేపీ నేత లు గోసుల శ్రీనివాసుల రెడ్డి, చలపతి, కల్యాణ్‌రాజ్, వై.హరినారాయణరావు, శోభాభాయి, చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

జ్యోతిరావుఫూలే సర్కిల్‌ను పరిశీలిస్తున్న బీజేపీ ప్రతినిధులు

యువతే దేశసంపద

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి గోపాల్





రామిరెడ్డి కళాశాలలో మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ అధికారి గోపాల్

వేంపల్లె డిగ్రీ కళాశాల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ సరితారెడ్డి

సికెదిన్నె, జూన్ 26: నేటి యువత రేపటి దేశసంపద అని అటువంటి యువత మంచిమార్గంలో నడిచి ఆదర్శవంతమైన సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి గోపాల్ తెలిపారు. అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని స్థానిక ప్రకృతి నగర్‌లోని రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి మత్తుపదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. యువత మత్తులో పడితే వారి భవిష్యత్తు చిత్తవుతుందని దేశం అభివృద్ధివైపు నడపడంలో యువత చెడుమార్గంలో నడవడం వలన తిరోగమనానికి కారణం అవుతారన్నారు. మత్తు పదార్థాలు సేవించడం వలన వారి జీవితం నాశనం కావడంతోపాటు వారి తల్లిదండ్రులు ఎన్నో ఇబ్బందులకు గురవుతారని సమాజంలో విలువలేకుండా ఎందుకూ పనికిరాకుండా తయారవుతారన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మత్తు పదార్థాలను దూరం పెట్టాలని తద్వారా ఉన్నతవిద్య అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుని సమాజానికి సేవ చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నెల్సన్‌కుమార్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థాయికి చేరాలంటే క్రమశిక్షణ, పట్టుదల కలిగి చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది క్రిష్ణకుమార్, కళాశాల అధ్యాపక సిబ్బంది కల్పన, సుచరిత, రాజారాం, పద్మాకర్, ప్రభు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

వేంపల్లెజూన్ 26: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి ఎస్ఈబీ సీఐలు సరితారెడ్డి, అన్నపూర్ణ సూచించారు. స్వామివివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అక్షర మహిళా జూనియర్ కళాశాల ప్రాంగణలో బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల జరిగే దుష్ప్రభావాలను వివరించారు. మనుషుల ద్వారా రవాణా అవుతోందని, యువత చైతన్యమైతే మాదకద్రవ్యాల రవాణాను అరికట్టవచ్చని తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భారతి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఓబుల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులతో మంచిలాభాలు

పులివెందుల టౌన్, జూన్ 26: సేంద్రీయ ఎరువుల వాడకంతో అధిక దిగుబడి వచ్చి మంచి లాభాలు చేకూరుతాయని నవభారత్ ఫర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్‌లు శ్రీకృష్ణ, నాగేంద్ర పేర్కొన్నారు. చిన్నరంగాపురం, బ్రాహ్మణపల్లెల్లో రైతు సదస్సును ఏర్పాటు చేశారు. సేంద్రీయ ఎరువులు వాడకం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి లక్ష విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

చక్రాయపేట, జూన్ 26: గండి క్షేత్రంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి లింగాల మల్‌రెడ్డి, సతీమణి మంగమ్మ రూ.1,11,116 విరాళం అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి తెలిపారు. బుధవారం ప్రొద్దుటూరు పట్టణం రాజా బృందావనం ప్యాలెస్ వాస్తవ్యులు దివంగతులు లింగాల మల్లారెడ్డి, ఎరికలమ్మ జ్ఞాపకార్థం వీరికుమారుడు లింగాల మల్‌రెడ్డి, సతీమణి మంగమ్మ ఈ చెక్కును ఆఫీస్ సూపరింటెండెంట్ షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ రవిచంద్రారెడ్డికి అందించారు. వీరికి స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి, చిత్రపటాన్ని అందించినట్లు తెలిపారు.

కబ్జాదారుల నుంచి మా భూమిని రక్షించండి

కడప (మారుతీనగర్), జూన్ 26: కబ్జాదారుల బారి నుంచి మా భూమిని రక్షించాలని గోపవరం మండలానికి చెందిన రాజేశ్వరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆమె మాట్లాడుతూ వారసత్వంగా మా తండ్రి నూనె సుబ్బరాయుడుకు గల 5.08 ఎకరాల భూమిలో తనకు 2.54 ఎకరాల భూమి సంక్రమించిందన్నారు. అయితే ఆ భూమిని కొందరు పనిగట్టుకుని కబ్జాకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కబ్జాదారులు వారిని కూడా బెదిరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

వల్లూరు టు తిరుమల తెలుగుతమ్ముళ్ల పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 26: సార్వత్రిక ఎన్నికల్లో కమలాపురం ఎమ్మెల్యేగా పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి విజయం సాధించడంతో మొక్కు చెల్లించుకునేందుకు టీడీపీ నేతలు, కార్యకర్తలు బుధవారం కాలినడకన తిరుమలకు పయనమయ్యారు. వల్లూరు మండలం దిగువపల్లె వాసులు తిరుమలకు పాదయాత్ర చేస్తామని మొక్కుబడి పెట్టుకున్నట్లు మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దిగువపల్లెలోని అంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి, యువనేతలు పుత్తాసాయి నరసింహారెడ్డి, యశ్వంత్‌రెడ్డి, వల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన గెలుపు కోసం కష్టపడి పనిచేయడమేకాక దేవునికి మొక్కుకుని తిరుమలకు కాలినడకన వెళుతున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యర్రమాచు రామసుబ్బారెడ్డి, గడికోట సుధాకర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, మండల టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్లప్పగారి రామచంద్రారెడ్డి, కడప పార్లమెంటు బీసీ కార్యదర్శి ఇరగబోయిన హరిక్రిష్ణ యాదవ్, శ్రీనివాసులురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆకుల శ్రీనివాసులు, విశ్వనాధరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

29న లోక్ అదాలత్

కమలాపురం రూరల్, జూన్ 26: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి లావణ్య తెలిపారు, సివిల్, క్రిమినల్ బ్యాంకు కేసుల్లో రాజీ ధోరణిలో ఉన్న కక్షిదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వానపాముల ఎరువు తయారీపై శిక్షణ

సికెదిన్నె, జూన్ 26: వానపాముల ఎరువు తయారీపై నేటి నుంచి మూడు రోజులు శిక్షణ నిర్వహిస్తున్నట్లు కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శిల్పకళ తెలిపారు. స్కిల్ ఇండియా ప్రోగ్రాం ద్వారా వానపాముల ఎరువు తయారీపై యువతకు శిక్షణ నిర్వహిస్తామని, ఆసక్తిగల యువత వెంటనే పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8096888039 నంబరును సంప్రదించాలన్నారు.

'కౌన్సిల్ ఆమోదంతో పేరు మార్చాలి'

పులివెందుల రూరల్‌,జూన్ 26: పులివెందుల మున్సిపాలిటీలో జరగబోయే పనులకు కౌన్సిల్ ఆమోదం పొందాలని, అలా కౌన్సిల్ ఆమోదం లేకుండా పేరు మార్చడం సమంజసం కాదని మున్సిపల్ వైస్ ఛైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు వైఎస్సార్ కూరగాయల మార్కెట్‌కు రంగనాథస్వామి కూరగాయల మార్కెట్ అని బోర్డు ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు. అప్పట్లో స్థానిక వ్యాపారులు, ప్రజలు మార్కెట్‌కు వైఎస్సార్ పేరుపెట్టాలని విన్నవించడంతో నాడు మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రవేశపెట్టి ఆమోదించామన్నారు. పద్ధతి ప్రకారం పేరు మార్చినట్లు ఆయన గుర్తుచేశారు.

'సిబ్బంది నియామకాల్లో గోల్‌మాల్'

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 26: వైసీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకే నియామకాల్లో గోల్‌మాల్ జరిగిందని, ఫైళ్లను గల్లంతు చేశారని తక్షణమే విచారణ చేపట్టాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఏఓ విజయకుమార్‌ను కలిసి వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడుతూ నాటి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది నియామకాల్లో అప్పట్లో అనేక ఆరోపణలు, విమర్శలు వచ్చాయన్నారు. కడప వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆర్‌బీకే సిబ్బంది నియామక ఫైల్స్ మాయం వెనక వైసీపీ హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. వెంటనే దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డిసాయి పాల్గొన్నారు.

తెలుగులో ప్రమాణం చేయడం హర్షణీయం


జీఓ 85ను రద్దు చేయాలి : తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 26: తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ ఎంపీగా గెలిచిన కె.గోపీనాథ్ మంగళవారం లోక్‌సభలో అచ్చమైన తెలుగు భాషలో ప్రమాణం చేయడం హర్షణీయమని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వాళ్లకు ఇది గర్వకారణమన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల కేంద్రమంత్రులు చాలా మది ఎంపీలు తెలుగు భాషలో ప్రమాణం చేయడం శుభసూచకమన్నారు. దీని వలన తెలుగు భాషకు, తెలుగు జాతి అస్థిత్వం నిలబడుతుందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో తెలుగు భాష పట్ల పూర్తి నిర్లక్ష్యం చూపిందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని రద్దుచేసి ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెడుతూ 20.11.2019న జీఓ 85ను జారీచేసిందని, ఫలితంగా రాబోయే రోజుల్లో తెలుగు భాష మృతభాషగా మారిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన సందర్భంగా రాష్ట్రంలోని అన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాథమిక విద్యను మాతృభాష తెలుగులోనే తప్పనిసరిగా బోధించే విధంగా విధాన నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలి'

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 26: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలని కొన్ని ప్రాంతాల్లో అయితే ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల రసంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వపాఠశాలల్లో కనీసం ఫుడ్ కూడా ఇవ్వని పరిస్థితులు ఉన్నాయన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులు విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నేతలు చెన్నకేశవరెడ్డి, హరిబాబు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

8 టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్




గనుల శాఖ సీజ్ చేసిన టిప్పర్లు

పులివెందుల/వేముల, జూన్ 26: వేముల మండలంలో జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేస్తున్న 8 టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్ చేసినట్లు జిల్లా గనులశాఖ అధికారి రవిప్రసాద్ తెలిపారు. రోడ్డు పనులకు సంబంధించి అనుమతులు లేకుండా మట్టి తోలుతుండగా వీటిని సీజ్ చేశామన్నారు. తొండూరు మండలం గోటూరు నుంచి అనుమతులు లేకుండా మట్టిని తవ్వి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి'

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 26: జిల్లాలో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వార్డెన్లను సస్పెండ్ చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర క్యాదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. బుధవారం పీఎస్‌యూ కార్యాలయంలో మాట్లాడుతూ ముద్దనూరు సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు ఫుడ్‌పాయిజనింగ్ జరిగి ప్రాణాపాయ స్థితికి కారణం హాస్టల్ అధికారి అని ఆరోపించారు. హాస్టల్ విద్యార్థులకు నాశిరకం ఇడ్లి పెట్టడం వల్ల ఫుడ్‌పాయిజన్ జరిగి అస్వస్థతకు గురికావాల్సి వచ్చిందన్నారు. హాస్టల్ అధికారి విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థుల అస్వస్థతకు కారణమైన వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పీఎస్‌యూ నేతలు పాల్గొన్నారు.

తీరు మార్చుకోకపోతే వేటు తప్పదు : ఎమ్మెల్యే చైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, జూన్ 26: అధికారుల అలసత్వమే ప్రజలకు శాపంగా మారుతుందని మారకపోతే వేటు తప్పదని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు శాపంగా మారుతోందని తీరు మారకపోతే వేటు తప్పదన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. శాఖల వారీ వారి పనితీరును సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమ్యలను సత్వరం పరిష్కరించేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్, అగ్రికల్చర్, పశుసంవర్ధకశాఖ, విద్యుత్, నియంత్రణ విద్య తదితర శాఖల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం చేసే విధంగా ఉండాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. రెవెన్యూ కార్యాయలంలో ధృవీకరణ పత్రాలకు వచ్చిన ప్రజలను ఇబ్బందులకు గురి కాకుండా సకాలంలో ధృవీకరణ పత్రాలు అందించేలా అధికారులు పనిచేయాలన్నారు. కమలాపురం మండలాన్ని ఒక మోడల్‌గా చేయాలన్నారు. స్థానిక రైతు బజారు కేంద్రంలో వల్లూరు, కమలాపురం ఎర్రగుంట్ల, వీఎన్‌పల్లె మండలాల వ్యవసాయ అధికారులు రైతు భరోసా కేంద్ర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి ఎమ్మార్వో సుబ్రమణ్యం, ఏడీఏ నరసింహారెడ్డి, ఉప ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, జడ్పీటీసీ సుమిత్ర, మండల అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



పోరుమామిళ్ల, జూన్ 26 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సర్పంచ్ యనమల సుధాకర్, స్పెషల్ ఆఫీసరు చంద్రశేఖ ర్ అన్నారు. బుధవారం పోరుమామిళ్లలోని జిల్లా పరిషత్ హైస్కూలులో మధ్యాహ్న భోజన పథకాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ వంటను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షరీఫ్, చెన్ను రమణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే చర్యలు

ప్రొద్దుటూరు, జూన్ 26 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ విక్రయాలపై నిషేధం విధించిందని అయినా వ్యాపారులు జరుపుతున్నారని చర్యలు తప్పవని కమిషనర్ రఘునాథరెడ్డి హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో ప్లాస్టిక్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ 40 మైక్రాన్‌ల కంటే తక్కువ బరువున్న ప్లాస్టిక్ కవర్లు నిషేధింపబడ్డాయన్నారు. అయినా విచ్చలవిడిగా పట్టణంలో వినియోగంలో వుంటున్నాయన్నారు. అలాగే ప్లాస్టిక్ గ్లాసులు ఇతర వేటినీ విక్రయించరాదని హెచ్చరించారు. ఇందుకు రెండు నెలలు గడువు ఇస్తే వాటిని విక్రయించి ఆ తరువాత సరుకు తెప్పించబోమని వ్యాపారులు కోరారు. కానీ అందుకు కమిషనర్ అంగీకరించలేదు. జూలై 1 నుంచి పట్టణంలో ఎక్కడా ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే దాడులు తప్పవన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉట్టి కిరణ్, నూర్‌బాషా, వంకంసుబ్బరాయుడు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు



ఖాజీపేట, జూన్ 26: సార్వత్రిక ఎన్నికల్లో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అధిక మెజార్టీతో గెలిస్తే నాగనాధేశ్వరుడికి 101 టెంకాయలు కొడతామని మొక్కుకున్న ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ గంగవరం ఆదినారాయణరెడ్డి బుధవారం మొక్కును తీర్చుకున్నారు. అనంతరం నాగనాధేశ్వరునికి ప్రత్యేక అభిషేకం చేసి వారి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, టీడీపీ నాయకులు దుగ్గిరెడ్డి లక్ష్మీరెడ్డి, కోరా చంద్ర ఓబుళరెడ్డి, నంద్యాల సుబ్బయ్య, వెంకటరెడ్డి,సుమన్‌రెడ్డి,హరినాథరెడ్డి,బి.చంద్ర ఓబుల్ రెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, పల్లె గంగాధర్ పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 26: సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఓబులేసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని, యాజమాన్యాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నా అడిగేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు.సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, సభ్యులు హరి, మచ్చా శ్రీను పాల్గొన్నారు.

ఎన్నికల విధుల అవకతవకలపై విచారణ జరపాలి

పోరుమామిళ్ల, జూన్ 26 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా బద్వేలు నియోజకవర్గానికి కేటాయించిన ఎన్నికల విధులనిర్వహణలో జరిగిన అవకతవకలు, ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి నిజనిజాలు వెల్లడి చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సాయంత్రం పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్రమణ్యం, చంద్రహాసరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, బాలరాజు, వాకా చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, జనార్దన్, శ్రీనివాసులు, గురయ్య పాల్గొన్నారు.

బద్వేలు..: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు బద్వేలు నియోజకవర్గానికి కేటాయించిన నిధులలో దాదాపు కోటి రూపాయలు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్‌జీవో కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, ట్రెజరర్ గుర్రయ్య, గోపవరం మండల అధ్యక్షుడు క్రిష్టఫర్ , జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

'వీఆర్వోలను సస్పెండ్ చేయాలి'

కలసపాడు, జూన్ 26 : ఎగువతంబళ్లపల్లె వీఆర్వో, పెండ్లిమర్రి వీఆర్వోలను సస్పెండ్ చేయాలని తహసీల్దారు ఆఫీసు వద్ద కేవీపీఎస్ బుధవారం జిల్లా కమిటీ సభ్యుడు డి.ప్రవీణ్‌కుమార్ అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ కలసపాడు తహసీల్దారును డిమాండ్ చేశారు. కలసపాడు మండలంలో చెరువుల్లో గత నెల మట్టి తవ్వకాలపై బద్వేలు ఆర్డీవోకు కలెక్టరుకు తహసీల్దారు, వీఆర్వోలపై ఫిర్యాదు చేశామన్నారు. విచారణకు వెళ్లారు కానీ తహసీల్దారు, వీఆర్వోలపై ఎటువంటి చర్యలు లేవన్నారు. ఇప్పటికైనా ఎగువ తంబళ్లపల్లె,పిడుగుపల్లె వీఆర్వోలు, తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సుదర్శన్, ఆవాజ్ మండల అధ్యక్షుడు హుసేన్‌పీరా, కార్యదర్శి చిన్ననాగూరువల్లి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

మైదుకూరు, జూన్ 26 : విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలని ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ నిర్వాహకుడు పీవీ క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల నివారణ దినం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులచే పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ భూముల కౌలు హక్కుల వేలం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 26: మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో ఉన్న కోదండరామ స్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల భూములకు వేలం పాటలు నిర్వహించారు. బుధవారం పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో కల్లూరులోని 11వ సర్వేనంబరులో 32 ఎకరాలకు ఒక సంవత్సర కాలపరిమితికి వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో 25 మంది రైతులు పాల్గొనగా తొమ్మిది మంది రైతులు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి రూ.1,44,200లకు రైతులు భూములను దక్కించుకున్నారు. గత సంవత్సరం ఇవే భూములకు రూ.2.30 లక్షల ఆదాయం రాగా ప్రస్తుతం రూ.1,44,200 రావడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఈవో రమణారెడ్డి, మైదుకూరు గ్రూప్ టెంపుల్ ఈవో ఎంఎస్‌ప్రసాద్, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరు..: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీలోని బస్టాండ్,జంతువధశాలలో గేట్ల వసూలుకు వేలం పాట నిర్వహించారు.ఈ వేలం పాటలో బస్టాండుకు సర్కారు వారి పాట రూ.8.25లక్షలకు కేటాయించగా వినోద్ రూ.8.26లక్షలకు దక్కించుకున్నారు. జంతువధశాల సర్కారు వారి పాట రూ.1.32 లక్షలకు కేటాయించగా రామలక్షుమ్మ రూ.1.33లక్షలకు దక్కించుకున్నారని ఈవోపీఆర్డీ వీరభద్రుడు తెలిపారు.

మద్యం బాటిళ్లు చోరీ

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 26 : పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ జరిగినట్లు ఎక్సైజ్ సీఐ సుహాసిని ఫిర్యాదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి టుటౌన్ బైపాస్‌రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం మూసేసి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తర్వాత వెనుక వైపున ఉన్న వాకిలిని పగలుగొట్టి మద్యం దుకాణంలోనికి ప్రవేశించిన వ్యక్తులు 23 వేల రూపాయల విలువ చేసే మద్యం బాటిళ్లను దొంగలించారన్నారు. ఈ మేరకు ఎక్సైజ్ సీఐ సుహాసిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

జీవో నెంబర్ 117ను రద్దుచేయాలి

కాశినాయన,జూన్ 26:ప్రాథమిక పాఠశాల స్థాయిలో విద్యాభివృద్ధికి అవరోధంగా ఉన్న గత ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 117ను వెంటనే రద్దుచేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ యు.సుబ్రమణ్యం పేర్కొన్నారు.బుధవారం నర్సాపురం జడ్పీ హై స్కూల్, ఏపీమోడల్ పాఠశాల తదితర స్కూళ్లల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు బి.బాలరాజు, ఎం.రామక్రిష్ణారెడ్డి, ఎం.రవీంద్రబాబు, ఎం.బాలోబయ్య,టి.ప్రదీప్, వి.చంద్రశేఖర్, జి.రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమృతానగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 26: అమృతానగర్‌లో నివశించే ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి అమృతానగర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008, 2018లో అమృతానగర్‌లో 2,500 మందికి ఇళ్లస్థలాలు ఇచ్చారన్నారు. 15 సంవత్సరాలుగా రోడ్లు, మంచినీరు, కాలువలు, విద్యుత్తు సమస్యలతో అక్కడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీనిపై అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా అమృతానగర్ ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హసీనా, పుష్పలత, పెంచల్‌రెడ్డి, హరి, విశ్వనాథ్, చంటి, బాబు, మల్లిక, భాను, పార్వతి, గోవిందమ్మ, అమృతానగర్ ప్రజలు పాల్గొన్నారు.

ముక్తియార్ సేవానిరతి గల నాయకుడు



పరీక్ష సామగ్రి అందజేస్తున్న సురేశ్‌నాయుడు, ముక్తియార్

ప్రొద్దుటూరు, జూన్ 26 : ప్రొద్దుటూరు మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ ఛైర్మన్ వీఎస్ ముక్తియార్ సేవానిరతి గల ప్రజా నాయకుడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేశ్ నాయుడు కొనియాడారు. బుధవారం కొత్తకొట్టాల మున్సిపల్ ఉర్దూ హైస్కూలులో ముక్తియార్ జన్మదిన వేడుకల సందర్భంగా పిల్లలకు పరీక్ష సామగ్రిని సురేశ్ నాయుడు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఖలీల్ పాఠశాల హెడ్మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సాయంత్రం అమృతనగర్‌లో ఈద్గాకమీటి ఆధ్వర్యంలో ముక్తియార్ మొక్కలు నాటారు కార్యక్రమంలో ఖలీల్, డాక్టర్ గౌస్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వరదరాజులరెడ్డిని సత్కరిస్తున్న ఎన్జీవో అసోసియేషన్ జిల్లా నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 26: అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరంచాలని ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, జిల్లాకార్యదర్శి జి.రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సహాధ్యక్షుడు తిమ్మారెడ్డి, కోశాధికారి నిత్యపూజయ్య, ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, కార్యదర్శి రామసుబ్బయ్య, సహా అధ్యక్షుడు సదాశివ, పట్టణాధ్యక్షుడు పద్మనాభం, మైదుకూరు అధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఖాజీపేట, జూన్ 26: ప్రతి స్కూల్లో పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని లేదంటే చర్యలు తప్పవని ఎంపీడీవో సుమిత్రమ్మ అన్నారు. బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు మధ్యాహ్న భోజనం ఎటువంటి రాజీపడకుండా ప్రభుత్వం చెప్పిన విధంగా అందించాలన్నారు. ఏవైనా అవకతవకలకు పాల్పడినట్లు తెలిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.









